వైఎస్ఆర్
కడప-అన్నమయ్య వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
బుధవారం 08 అక్టోబర్ 2025

ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలి

కడప క్రైం, అక్టోబరు 7, ప్రభాతవార్త:

రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆకాంక్షించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోదించే మధుర కావ్యం రామాయణమన్నారు. అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు శివరాముడు, టైటాస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిటిఎం జిల్లా పరిషత్‌స్కూల్‌లో కబడ్డి, చెస్ పోటీలు

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

మదనపల్లె డివిజన్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా మదనపల్లె మండలం సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాల బాలికల కబడ్డి, చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు డివిజన్‌లోని సుమారు 900మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సిటిఎం ప్రధాన ఉపాధ్యాయులు కబడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు పాల్గొనడంతో ఆరోగ్యం చురుకుదనం వస్తుందన్నారు. స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ డివిజన్ స్థాయి జట్టుని ఎంపిక చేసి జిల్లా స్తాయిపోటీలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ భద్రయ్య, శివశంకర్, దిలీప్, నరేష్, మహేంద్రనాయక్, బాలాజీ, విజయ్‌కుమార్, సుధాకర్, వరలక్ష్మి, భారతి, ఉమా పాఠశాల ఉపాధ్యాయులు గిరిధర్‌నాయక్, సుజాత, రమేష్, భారతి, సురేంద్రప్పలు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్లలో భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

కడప కలెక్టరేట్, అక్టోబర్ 07 ప్రభాతవార్త:

బాణసంచా గోడౌన్ల నిర్వాహకులు ఫైర్, భద్రతా నిబంధనలు(సేఫ్టీ మెజర్స్) ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ రూమ్ హాలులో దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు.. తదితర అంశాలపై..జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు లతో కలసి ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్స్, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ డివిజన్ లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ.. సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. కమ్యూనిటీ ఓపెన్ ఏరియాలలో క్రాకర్స్ వినియోగించేలా చూడాలన్నారు. అలాగే పాఠశాలల్లో పిల్లలకు టపాసుల వినియోగం, భద్రతపై అవగాహన పెంచాలన్నారు. అలాగే ప్రజలందరూ సేఫ్టీ మేజర్స్ పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖలు ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలన్నారు. అలాగే కమర్షియల్ టాక్స్ అధికారులు అన్ని డివిజన్లోని ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అధికారులతో సమావేశం నిర్వహించి భద్రత ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. అలాగే అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్స్ పర్మిషన్లు తదితర అంశాలపై సడన్ విసిట్లు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా ఇల్లీగల్ స్టోరేజ్ పాయింట్లు కనపడితే వెంటనే వాటిని చీజ్ చేసి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే లోకల్ క్రాకర్స్ తయారీ వంటి వాటిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 102,మెడికల్ క్యాంపులను అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో.. బాణసంచా విక్రయ కేంద్రాలకు పరిమిత సంఖ్యలో అనుమతులు ఇవ్వాలని సంబందిత అధికారులకు సూచించారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే.. విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని సంబందిత మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్,సాయి శ్రీ,చెన్నయ్య జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ సాయి ధర్మా రావు,అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ ,మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ ద్వారా ప్రభుత్వ అందించే సేవలపై

ప్రజల్లో అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి అక్టోబర్ 07 ప్రభాతవార్త.

వాట్సాప్ ద్వారా ప్రభుత్వము అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లాలో భూగర్భ జలాలు పెరగడమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సబ్ కలెక్టర్లు ఆర్డిఓ తాసిల్దార్లు మునిసిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు నీటిపారుదల శాఖ హౌసింగ్ శాఖ తదితర శాఖల అధికారులతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాలు, పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన సమస్యల పరిష్కారం, వాట్సాప్ గవర్నెన్స్, జీవో ఎంఎస్ నెంబర్ 30, ప్రజల నుండి వివిధ అంశాలపై తీసుకున్న ప్రజాభిప్రాయ సేకరణ, జలజీవన్ మిషన్ కు అవసరమయ్యే భూసేకరణ, రీ సర్వే, నరేగా, చిన్న తరహా నీటిపారుదల, స్వచ్ఛ ఆంధ్ర, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమాలను ప్రజలందరికీ చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని కార్యక్రమాల అనంతరం సంబంధిత ఫోటోలను వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని సూచించారు. బ్యాంకర్లతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని జిఎన్పి తగ్గింపు పై ప్రజల్లో అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లను ఆర్డిఓ ను ఆదేశించారు. జీవో ఎంఎస్ నెంబర్ 30 పైసమీక్షిస్తూ రెగ్యులరైజేషన్ ప్రక్రియలో పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలపై ప్రజల్లో ఎక్కువగా అవగాహన కల్పించి వాట్సాప్ ద్వారా అంది సేవలను వినియోగించుకునేలా చేయాలన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖకు అవసరమయ్యే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. చిన్న తరహా నీటిపారుదల శాఖపై సమీక్షిస్తూ ట్యాంకులు పూర్తిగా నిండేలా చర్యలు తీసుకోవాలని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంతో సమన్వయం చేసుకొని వర్షం పడినప్పుడు ట్యాంకులు నిండి భూగర్భ జలాలు పెరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు భవిష్యత్తుకు పునాదులు : జగన్ మోహన్ రాజు

రాజంపేట,అక్టోబర్ 7 ప్రభాతవార్త

మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యాలయాలు భవిష్యత్తుకు పునాదులు అని, ప్రతి పాఠశాల ఒక దేవాలయం తో సమానమని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమట్టి జగన్మోహన్రాజు అన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు చేయూతనిస్తే ప్రతి పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మంగళవారం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంట్రల్ హాల్లో పూర్వపు విద్యార్థులచే నిర్వహించిన కమ్మ డిస్టిక్ బోర్డ్ హై స్కూల్ 91 వ వార్షికోత్సవ వేడుకలకు చమర్తి జగన్మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు వార్షికోత్సవ వేడుకలు చేయడం చాలా ఆనందంగా ఉందని, 91 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు నిలయంగా మారిన పాఠశాలలో తాను ముఖ్యఅతిథిగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలను దేవాలయంగా, ఉపాధ్యాయులను దేవుళ్ళుగా భావిస్తే భవిష్యత్తులో అడగకుండానే వరాలు లభిస్తాయని, అందుకే ప్రతి విద్యార్థి తమ చదువుకున్న పాఠశాలతో పాటు గురువులను కూడా గౌరవించాలని ఆయన తెలియజేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి పోలూరు మురళి మాట్లాడుతూ ఆవిర్భావంలో హైస్కూల్ గా ప్రస్తుతం జూనియర్ కళాశాలగా 91 సంవత్సరాల పాటు వేలాదిమంది విద్యార్థులకు విద్యను అందించిన విద్యా సంస్థ అభివృద్ధి భావి తరాలపై ఉందన్నారు. దాతల సహకారంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ జూనియర్ కళాశాల ఏర్పాటు అయిందని భవిష్యత్తులో దీన్ని మరింతగా అభివృద్ధి చేసే బాధ్యత ఇక్కడ వచ్చిన అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపల్ నెట్టెం శ్రీరాములు నాయుడు, మాజీ మండలాధ్యక్షుడు డాక్టర్ పారా సుబ్బారాయుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణ రాజు, విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏబి రామ్మోహన్ రెడ్డి, పుల్లంపేట ఎంఈఓ చక్రధర్ రాజు, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఈ విద్యా సంస్థలో చదివిన పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం జరిగింది. టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ఉపాధ్యాయ సిబ్బంది, స్టూడెంట్స్, పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలు కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొలకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందుపై బదిలీ వేటు

మదనపల్లి క్రైమ్ అక్టోబర్ 7 ప్రభాతవార్త.

నకిలీ మద్యం తయారీని గుర్తించడంలో అలసత్వం వహించిన ములకలచెరువు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) హిమబిందుపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. రెండు రోజుల క్రితం మనకు తెరువు మండలంలో సౌత్ ఆఫ్రికా తరహాలో నకిలీ మద్యం గుర్తు రట్టు చేసిన విషయం తెలిసిందే. నకిలీ మద్యం తయారీని గుర్తించి, అరికట్టడంలో నిరక్ష్యం వహించిన కారణంగా సిఐపై చర్య తీసుకున్నారు. హిమబిందును తక్షణమే విజయవాడ ఎక్సైజ్ కమిషనర్ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న కిషోర్‌కు ములకలచెరువు ఎక్సైజ్ సీఐగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న సమయంలో, అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.

జయచంద్రారెడ్డి సస్పెండ్‌పై టిడిపిలో సంబరాలు

తంబళ్ళపల్లెలో నూతన ఇన్‌చార్జ్ కోసం అన్వేషణ

మొరుసుకాపులను మోసగించాడంటూ ఆగ్రహాలు

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

జయచంద్రారెడ్డి

ములకలచెరువు కల్తీ మద్యంకేసులో ప్రధాన సూత్రదారి, పాత్రదారిగా వ్యవహరించిన జయచంద్రారెడ్డిపై తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన జయచంద్రారెడ్డి వ్యతిరేక వర్గీయులు, టిడిపి కార్యకర్తలు, నాయకులు గత రెండు రోజులుగా బాణసంచా పేల్చుతూ సంబరాలు జరుపుకొంటున్నారు. వైకాపా కోవర్టుగా ఉంటూ 2024ఎన్నికల్లో దాసరపల్లె జయచంద్రారెడ్డి టిడిపి అధిష్టానాన్ని మోసగించి తంబళ్ళపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్టును దొడ్డిదారిన తెచ్చుకొని ఎట్టకేలకు ఓటమి చెందిన విషయం తెలిసిందే. టిడిపి అధిష్టానాన్ని ఒప్పించి నియోజకవర్గానికి గత ఒకటన్నర ఏడాదిగా ఇన్‌చార్జ్‌గా వ్యవ హరిస్తున్నారు. ఈ నేపథ్యంలో డబ్బును దొడ్డిదారిన సంపాదించుకునేందుకు లిక్కర్ కల్తీ తయారీని ఎంచుకొన్నారు. అతని ప్రధాన అనుచరులుగా ఉంటున్న కట్టాసురేంద్రనాయుడు, మరో టిడిపి నేత జనార్ధన్‌రావులతో కలసి నకిలీ మద్యం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొలకలచెరువులోనే కాకుడా ఇబ్రహీం పట్టణంలో కూడా నకిలీ మద్యం కేంద్రాన్ని ఏర్పాటు చేసి భారీ ఎత్తున వైన్‌షాపులకు, బార్‌లకు, బెల్టుషాపులకు సరఫరా చేయడం జరిగింది. ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో నకిలీ మద్యం పట్టుబడడంతో జయచంద్రారెడ్డి బాగోతం బట్టబయలైంది. ఎన్నికలకు ముందు ఆయన తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొని నామమాత్రంగాఎమ్మెల్యే ఎన్నికలకు పోటీ చేసి తెలుగుదేశం పార్టికి తీవ్ర ద్రోహం చేశారని ఆపార్టీకి చెందిన పలువురు అప్పట్లోనే పలు విమర్శలు చేశారు. వైకాపా వ్యతిరేకత, తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలో కూడా ఆయన ఎన్నికల్లో గెలుపొందలేక పిఎల్ఆర్ కుటుంబీకులతో టైఅప్ అయ్యారంటూ పెద్దఎత్తున విమర్శలు కూడా వెల్లువడ్డాయి. నకిలీ మద్యం కేసులో ఎట్టకేలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీరియస్‌గా తీసుకొని ఇన్‌చార్జ్‌గా ఉంటున్న దాసరపల్లె జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేయడంతో తెలుగుదేశంపార్టీకి తగిన న్యాయం జరిగిందని ఆ పార్టీలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తాయి నాయకులు సంబరాలు చేసుకోవడం జరిగింది. తంబళ్ళపల్లె నియోజకవర్గంలో వైకాపా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని ఎదుర్కునే దీటైన టిడిపి ఇన్‌చార్జ్ నాయకుని కోసం టిడిపి అధిష్టానం అన్వేషిస్తోంది. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, మరో మాజీ ఎమ్మెల్యే ఏవి.ప్రవీన్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినపడుతున్నాయి. వీరిలో ఎవరికి ఇన్‌చార్జ్ ఇచ్చినా తంబళ్ళపల్లెలో పిఎల్ఆర్ కుటుంబాన్ని ఎదుర్కొనే సత్తా ఉంటుందంటూ టిడిపి నాయకుల్లో చర్చ జరుగుతోంది. అధిష్టానం నాలుగురోజుల్లో ఇన్‌చార్జ్ నాయకున్ని నియమిస్తూందంటూ తంబళ్ళపల్లెలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా దాసరపల్లె జయచంద్రారెడ్డి రాజకీయం మూన్నాళ్ళ ముచ్చటగానే ముగిసింది. మొరుసుకాపుల పేరుతో అందరిని మోసగించారంటూ తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన మొరుసుకాపులు ఆగ్రహం చెందుతున్నారు.

సంబరాలు జరుపుకొంటున్న కార్యకర్తలు

ఎమ్మెల్యే రాకతో మండల సమస్యలు తీరునా..

చిట్వేలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:

పెచ్చులూడుతున్న భవనం

వాగును తలపించే సింగనమల వీధి.

నేడు జరగనున్న మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరవుతున్న తరుణంలో మండల ప్రజలను వేధిస్తున్న సమస్యలు చేర్చుకువచ్చేనా, ప్రజలకు మేలు జరిగేనా..??అన్న గుసగుసలు వినబడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్య రెండు సంవత్సరాలవుతున్నా మండలంలోని ప్రధాన సమస్యలు ఏ ఒక్కటి తీరలేదని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్లస్‌టుగా పదోన్నతి పొందిన ప్రభుత్వ కళాశాలలో నిండుగా విద్యార్థులు ఉన్నను, ఏ ఒక్కరూ బోధకులు లేకపోవడం పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే వైద్యులకు రక్షణ కరువైందని, గత సార్వత్రిక ఎన్నికల ముందు ఆసుపత్రి నూతన భవనం పూర్తిస్థాయిలో పూర్తయినా,ఇంతవరకు ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం చేయకపోవడంలో ఉన్న ఇబ్బంది ఏమిటన్న విమర్శలు వినబడుతున్నాయి. చినుకు పడితే వాగును తలపించే సింగనమల వీధి ఆర్ అండ్ బి రోడ్డు బాగు చేయడం వాగ్దానాలకే పరిమితమా..? మా ఇబ్బందులు పట్టవా.?? అని బాధిత ప్రజలు నిట్టూరుస్తున్నారు. కార్యాలయాలు ఉన్నా ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులు అందుబాటులో లేక ప్రజలు తమ సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలో తెలియని పరిస్థితి మండలంలో ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.సత్వరమే శాసనసభ్యులు ప్రజల సమస్యలపై స్పందించి, న్యాయం చేకూర్చాలని ముకుమ్మడిగా మండల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

మహిళలకు రక్షణ కవచం 'శక్తి'యాప్

కడప క్రైం, అక్టోబరు 7, ప్రభాతవార్త:

జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాఠశాలలు మరియు కళాశాలల్లో 'శక్తి' యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీం మహిళా ఎస్సై శాంతమ్మ తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై కడప నగరంలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తియాప్ డౌన్‌లోడ్ చేసే విధానం వివరించి మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100/112, చైల్డ్‌లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, ప్రతి మహిళా, బాలిక తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి వారిని చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డా.వై.నాగరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.నాగమల్లికార్జున, శక్తి టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్

రాజంపేట,అక్టోబర్ 7 ప్రభాతవార్త

అన్నమాచార్య యూనివర్సిటీకు విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు అధ్యాపకులు 6వ గ్లోబల్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ - 2025 అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ, కడపలోని కె.ఎస్.ఆర్.ఎం ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అవార్డులను 2025 అక్టోబర్ 5న ట్రిబుల్ ఐటీ ఇడుపులపాయ డైరెక్టర్ డాక్టర్ ఏ.వి.ఎస్.ఎస్. కుమార స్వామి గుప్తా చేత ప్రదానం చేశారు.ఈ అవార్డుల్లో, బెస్ట్ టీచర్ అవార్డు విభాగంలో డాక్టర్ ఎం. పద్మ లలిత, బెస్ట్ ప్లేస్‌మెంట్ టీచర్ అవార్డు విభాగంలో ఏ. సునీల్, బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అవార్డు విభాగంలో డాక్టర్ బి. నాగముని, బెస్ట్ ట్రైనర్ అవార్డు విభాగంలో ఎస్. పార్థ సారథి,విద్యా సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు డాక్టర్ డి. జే. సమథానాయుడును ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల బ్రాండ్ అంబాసడర్గా సత్కరించారు.ఈ విజయాల సందర్భంగా చాన్సలర్ డాక్టర్ సి. గంగిరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఈ. సాయి బాబా రెడ్డి, వైస్ ఛైర్మన్ సి. యెల్లా రెడ్డి, మరియు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. ఎం. వీ. నారాయణ విజేతలందరినీ మంగళవారం అభినందించారు. ఇలాంటి విజయాలు అన్నమాచార్య యూనివర్సిటీ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని చాన్సలర్ డాక్టర్ సి. గంగిరెడ్డి తెలిపారు.

అన్నదమ్ముల అన్యోన్నతకు ప్రతిరూపం రామాయణం

- వాల్మీకి మహర్షికి ఘన నివాళి

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 7, ప్రభాతవార్త:

కుటుంబంలో అన్నదమ్ముల అనోయన్నత ఎలా ఉండాలనే విషయంపై వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం రామాయణం రచించిన వాల్మీకి మహర్షి విగ్రహానికి ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జిలు వాల్మీకి సంఘ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కేవలం పూలమాలలు వేయడమే ఆయనకు నివాళి కాదని ఆయన రచించిన రామాయణంలోని సారాంశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని పాటించాలన్నారు. 500 సంవత్సరాలుగా ఉన్న అయోధ్య సమస్యను ప్రధాని మోదీ పరిష్కరించి అయోధ్యలో ఆలయం నిర్మించి బాల రాముడిని ప్రతిష్టించారని అయోధ్యలోని బాల రాముడి ఆలయం ఎంతో అపూర్వమన్నారు. అలాగే వాల్మీకులను ఎస్టీలోకి చేర్చేందుకు కూడా పార్లమెంటులో చర్చించానని తెలిపారు. భూపేష్‌రెడ్డి మాటట్లాడుతూ సమాజంలో హిందువులందరూ ఏ విధంగా మెలగాలి అన్నదమ్ములు ఏ విధంగా కలిసి మెలసి జీవించాలి గౌరవ మర్యాదలతో ప్రతి ఒక్కరూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలనే విషయాలను రామాయణంలో క్లుప్తంగా వాల్మీకి మహర్షి రచించారని వాల్మీకి మహర్షి రచించిన రామాయణం నేటికీ ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కుల నాయకులు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

బస్ డ్రైవర్ పై దాడి

దువ్వూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

ఆళ్లగడ్డ నుండి మైదుకూరుకు పోవు పల్లె వెలుగు బస్సు నడుపుతున్న బస్ డ్రైవర్ షేక్ మహమ్మద్ బాషాపై ఒక ప్రయాణికుడు దాడి చేశాడు. వివరాలు ఇలా

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకులు కృషి చేయాలి

పెనగలూరు అక్టోబరు 7 ప్రభాతవార్త

ఎంపీటీసీలు సర్పంచులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మంగళవారం పెనగలూరు మండల పరిషత్తు సభా భవనంలో మండల అధ్యక్షురాలు కొండూరు సౌందర్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో విజయరావు మండల అజెండాను చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో త్రాగునీరు వీధిలైట్ల సమస్యలు తన దృష్టికి అధికంగా వస్తున్నాయని అవి పరిష్కారం కావాలంటే ప్రతి మూడు నెలలకు ఓసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు సర్పంచులు హాజరైతే తమ గ్రామ పరిధిలో ఉన్న సమస్యలను అధికారులకు తెలిపితే వాటి పరిష్కార మార్గానికి సులభంగా ఉంటుందన్నారు. ఆరోగ్య శాఖ నుండి సమావేశానికి హాజరైన సిహెచ్ఓ నగేష్ ఐదు నిమిషాలకే వెళ్లిపోవడం జరిగింది అందువల్ల ఏ ప్రజా ప్రతినిధి ఆరోగ్య సమస్యల గురించి సభ దృష్టికి తేలేకపోయారు. కటావారిపల్లె పంచాయతీ పరిధిలో పక్కా గృహాలు మంజూరుకు అర్హతఉన్న పలువురు ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులు పునాదులు నిర్మించుకొని ఆరు నెలల నుంచి ఎదురు చూస్తున్నామన్నారు స్థానిక తాసిల్దారు పోసిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఇప్పటికీ మూడు సమావేశా లలో ఇదే

ప్రస్తావన ఇస్తూనే ఉన్నారని కట్టా వారి పల్లి ఎంపీటీసీ కస్తూరి శ్రీనివాసులు నాయుడు సభలో సమస్యను పునరావృతం గావించారు. పెనగలూరు జగనన్న లేఔట్ లో రోడ్లు వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా తయారైపోయాయని కాలనీలో రోడ్లు మరమ్మతులు చేయించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని హౌసింగ్ కార్పొరేషన్ ఏ. ఈ హరి ప్రసాద్ సమస్యల సభ దృష్టికి తేగా వెంటనే స్పందించిన వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి చిన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవోను కోరారు. ఈ సమావేశంలో జడ్పిటిసి ఉదయగిరి పెద్ద సుబ్బరాయుడు వైస్ ఎంపీపీలు కొండూరు విజయ రెడ్డి బొడ్డు రోశయ్య తాసిల్దారు అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాల్సిందే

పీలేరు అక్టోబర్ 7 ప్రభాతవార్త:

వాల్మీకుల సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాల్సిందేనని ఈ సంఘం ముఖ్య నాయకులు గుండ్లూరు మురళి, రెడ్డప్ప, వెంకటరమణ, చంగల్ రాయులు, తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణంలో ఈ సంఘం నాయకుడు గుండ్లూరు మురళి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పక్కనే ఉన్న జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 60 సం లుగా ఉద్యమాలు ఇదే డిమాండ్‌తో పోరాటాలు చేస్తున్న ప్రధాన పార్టీలు వాల్మీకి సామాజిక వర్గాన్ని ఒక ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప, తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. వచ్చి శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా బిల్లు ప్రవేశపెట్టాలని వారి డిమాండ్ చేశారు. తమ డిమాండ్ సాధన కోసం పోరాటాలు చేస్తూనే ఉంటామని ఈ సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత సుధాకర్ బాబు, గురు మోహన్, వారాది వెంకటరమణ. మురళి మఠంపల్లి శీనా. ప్రసాద్, సుబ్రహ్మణ్యం, బోయపల్లి మురళి. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి ఉత్సవాలు

రాష్ట్ర స్థాయి ప్యాప్టో ధర్నాకు...

మైదుకూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్యాప్టో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల్ని పరిష్కరించాలని, పిఆర్‌సి కమిటీ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, బోధనేతర పనులు ఉపాధ్యాయులకు తీసివేయాలి తదితర సమస్యలపై విజయవాడ ధర్నా చౌక్ లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్యాప్టో ధర్నాకు హాజరయి తమ నిరసన వ్యక్తం చేస్తున్న మైదుకూరు ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, ఎస్ టి యు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్, ఎస్ టి యు జిల్లా ఉపాధ్యక్షుడు బి.కె సురేష్, ఎస్ టి యు సీనియర్ నాయకులు గంగారపు చంద్ర శేఖర్, కిరణ్ కుమార్, నాగరాజ ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని ఖండించండి

బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 07 ప్రభాతవార్త:

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్ పై రాకేష్ కిషోర్ కోర్టులో అందరి సమక్షంలో భూటుతో దాడి చేయటాన్ని ప్రజాస్వామిక వాదులు మానవతా వాదులందరు ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో జరిగిన సంఘటన అత్యంత దురదృష్టకరమైనది ఇటువంటి సంఘటనలు జరగకుండా పాలకులు చూడాలని ప్రజాస్వామ్య దేశంలో భారత రాజ్యాంగానికి లోబడిన వారు ఎవరు ఇటువంటి సంఘటనలను సహించరని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చంద్రాయుడు, నారాయణ, చెన్నయ్య, ఆది జాంబవ అరుంధతి అన్నదాన సత్రం చైర్మన్ చలపతి సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి గురయ్య, రెబ్బ నరసింహులు, సిపిఎం నాయకులు మునయ్య గురయ్య, విద్యార్థి సంఘం నాయకులు అరవింద్, ప్రదీప్, గురయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడానికి సహకరించండి

పీలేరు అక్టోబర్ 7 ప్రభాతవార్త ;

ప్రజా సమస్యల పరిష్కారానికి తమతో సహకరించాలని కొత్తగా విధుల్లో చేరిన గ్రామపంచాయతీ ఈఓను సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వార్డు సభ్యులు కోరారు. మంగళవారం సర్పంచ్, వార్డు సభ్యులు కొత్తగా వచ్చిన ఈవో బ్రహ్మానంద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు యువతో మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్సెస్ ను సకాలంలో పరిష్కరించేందుకు సహకరించాలని ఈఓకు విజ్ఞప్తి చేశారు. దినదిన అభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణ జనాభా కూడా అందుకు తగ్గట్టుగా పెరుగుతోందని అన్నారు. ముఖ్యంగా పట్టణంలో.పారిశుద్ధం, విద్యుత్ దీపాలు, స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలియజేశారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఈవోగా తాము చేపట్టే పనులకు తమ పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉదయ్ కుమార్, నాగభూషణం, మల్లికార్జున రెడ్డి, సాంబశివారెడ్డి, కాలేషా, సచిన్, విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, పిక్కా రమణ, ఆబిద్, పరమేష్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

ఈవోను సత్కరిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

ఈవో బ్రహ్మానందరెడ్డికి సన్మానం

పీలేరు అక్టోబర్ 7 ప్రభాతవార్త :

పీలేరు పంచాయితీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మానంద రెడ్డికు తెలుగు దేశం పార్టీ పీలేరు పట్టణ అధ్యక్షులు దలవాయి సురేష్ కుమార్ రెడ్డి (కంచి సూరి) పంచాయతీ కార్యాలయంలో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ పంచాయతీ ఈవో లేని దానివల్ల పారిశుద్ధం పడకేసిందని, పలుమార్లు జిల్లా అధికారులు విన్నవించిన కింది స్థాయి అధికారులు పట్టించుకోలేదని , దాంతో పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకు పోయిందని, పట్టణంలో పారిశుధ్య లోపం లేకుండా ఉండాలని అలాగే రాబోయే వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జయచంద్రా రెడ్డి షామియానా జయన్న, నాయకులు పోలిశెట్టి సురేంద్ర (సాపల సూరి) తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న పోలిశెట్టి సురేంద్ర తదితరులు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దువ్వూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

మండల పరిధిలోని సంజీవరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఇరగం రెడ్డి రామ్మోహన్ రెడ్డి మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంజీవరెడ్డి పల్లెకు చెందిన ఇరగం రెడ్డి రామ్మోహన్ రెడ్డి(29) బీటెక్ పూర్తి చేసి ఫైనాన్స్ కార్పొరేషన్ లో ఉద్యోగం చేశాడు. అయితే ఇటీవల వదులుకున్నాడు. ఆరోగ్యం సరిగా లేక మానసికంగా లేకపోవడంతో ఈనెల 5వ తేదీన పురుగుల మందు సేవించాడు. వెంటనే ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించినట్లు తెలిపారు. తండ్రి అంకిరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో సిఐ మృతి

ముద్దనూరు, అక్టోబర్07, ప్రభాతవార్త;

మండలంలోని నల్లబల్లె గ్రామానికి చెందిన కర్నూలు పట్టణం విఆర్‌లో తాత్కాలిక సిఐగా విధులు నిర్వహిస్తున్న 49 సంవత్సరాల జాన్సన్ బాబురావు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం నాడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వార్త వినగానే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తోటి సిబ్బంది శోకసముద్రంలో మునిగారు. 2002 సంవత్సరంలో పోలీస్ శాఖలో ఎస్సైగా విధుల్లో చేరి సీఐగా పదోన్నతి లభించినట్లు వివరించారు. మంగళవారం పోలీస్ శాఖ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో సొంత గ్రామం నల్ల బల్లె నుంచి ముద్దనూరు పట్టణంలోని ఎస్‌పిజి చర్చ్ ఆవరణములో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు సిఐలు, స్థానిక సిఐ దస్తగిరి, మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల సందర్శన

రామసముద్రం, అక్టోబర్ 7ప్రభాతవార్త

మండలంలోని మానేవారిపల్లె, అరికల గ్రామ పంచాయతీల లో మంగళవారం డిప్యూటీ ఎంపిడీవో గఫూర్ పారిశుధ్య పనుల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండిలో వేయాలని అన్నారు. అలాగే పారిశుద్య కార్మికులకు సకాలంలో శానిటేషన్ చేయాలని వాటర్ ట్యాంక్ లను శుభ్రంగా ఉంచాలని తెలియజేశారు. అలాగే అరికల జడ్పీ హైస్కూల్ నందు సూపర్ జి ఎస్టీ సూపర్ సేవింగ్స్ పై విద్యా ర్థులకు క్విజ్, ఎస్సే కాంపిటీషన్ నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న దుకాణాలు వెళ్లి జి ఎస్టీ గురించి దుకాణదారులకు అవగాహన కల్పించారు. జడ్పీ హైస్కూల్ లో మధ్యాహ్న భోజనాలను తనికీ చేశారు. రోజూ విద్యార్థులకు అందించే మెనూ గురించి హెచ్ ఎం చలపతి రాజు తో చర్చించారు. సచివాలయం సిబ్బంది తో సమావేశం నిర్వహించి రాబోయే రోజులు వర్షాలు ఎక్కువగా పడుతాయిని అంటురోగాలు ప్రభలుకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ సెక్రటరీ మధుకర్ రెడ్డి, హెచ్ ఎం చలపతి రాజు, ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బంది కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్ అందుకున్న విష్ణువర్ధన్

ఖాజీపేట, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్ 2025ను ఖాజీపేట మండలం అప్పన పల్లె వాసి పుల్లగూర విష్ణువర్ధన్ అందుకున్నారు. సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాష్ అండ్ హైజిన్, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన నిర్వహిస్తున్నందుకు గాను అవార్డును అందజేసినట్లు ఎన్జీవో అధ్యక్షుడు విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 17న మైదుకూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను చేస్తున్న సేవలను ప్రశంసించడం జరిగిందన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు గాను ఉత్తమ స్వచ్ఛ ఎన్ జీవో అవార్డు జిల్లా కలెక్టర్ శ్రీధర్, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కడప జేసి అతిథి సింగ్ చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్ అందుకున్నట్లు విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి విష్ణు వర్ధన్ ని ప్రశంసిస్తూ విష్ణు లాగే యువత సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని అన్నారు.

వెండి హస్తాలు సమర్పణ

పెండ్లిమర్రి, అక్టోబరు 7, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం పొలతలకు సంబంధించి అనుబంధ దేవస్థానం అయిన శ్రీ సుబ్రమణ్యం స్వామి వారికి కడప జిల్లా ఖాజీపేట మండలం నివాసి అయిన భూపతి రమణమ్మ, భూపతి ఆంజనేయులు ఒక కేజీ వెండి హస్తాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.కృష్ణ నాయక్, టీడీపీ శిరిగి రెడ్డి రాజారెడ్డి వారి ఆధ్వర్యంలో దేవస్థానానికి సమర్పించారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

పెండ్లిమర్రి, అక్టోబరు 7, ప్రభాతవార్త:

మండలంలోని అరవేటిపల్లి మరియు గోపరాజుపల్లి గ్రామాల్లో మంగళవారం పెండ్లిమర్రి ఎస్సై మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరవేటి పల్లి గ్రామానికి చెందిన నరేంద్ర నుంచి 10 క్వాటర్లు మద్యం బాటిళ్లు, గోపరాజుపల్లి గ్రామానికి చెందిన పంగా గంగన్న నుంచి 12 క్వాటర్లు మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే గ్రామానికి చెందిన పంగా ఆదినారాయణ నుంచి 15 క్వాటర్లు మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

సంక్షేమ పథకాల పేర్లు ఎవరు ఎన్ని మార్చినా వాటి రూపకల్పన వైయస్ కుటుంబానిదే

ప్రొద్దుటూరు అక్టోబర్ 7 ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేర్లు ఎవరు ఎన్ని మార్చినా వాటి రూపకల్పన ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే ఆ ఘనత దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతిని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటగా మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆటో డ్రైవర్లకు ఉపయోగ పడాలన్న ఆలోచనతో వాహన మిత్ర పేరుతో ప్రతి సంవత్సరం వారి ఖాతాలలో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన సంగతి ఆయన గుర్తు చేశారు. అదే పథకానికి సీఎం చంద్రబాబు పేరు మార్చి ఆటో డ్రైవర్ల సేవలో అనే పేరుతో ఆర్థిక సహాయం చేశాడే తప్ప తన సొంత ఆలోచన ఏమీ లేదన్నారు. ఇదొక్క పథకమే కాదు రాష్ట్రంలో ప్రతి పథకం వైయస్ జగన్మోహన్ రెడ్డి మదిలో నుండి వచ్చిన ఆలోచనలే తప్ప ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క సంక్షేమ పథకం చంద్రబాబు ఆలోచన చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ లు వరికూటి ఓబులరెడ్డి భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి బలిమిడి వెంకటలక్ష్మి మ్మ బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు తుపాకుల వెంకటరమణ చౌడం రవి వైసిపి నాయకులు సుబ్బరాయుడు, ఖమ్మం వెంకటేశ్వర్లు ఎస్సీ సెల్ నాయకులు వనం చిన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోనే నిర్వహించాలి

వేంపల్లె :అక్టోబర్:07:(ప్రభాత వార్త)

మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, ఏపి వక్ఫ్ బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి పలుమార్లు వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని పెంపొందించుకోవాలని, వక్ఫ్ ప్రాపర్టీలను రక్షించుకోవాలని సూచించారని, ఈ నేపథ్యంలో కడప అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా)ఉరుసు మహోత్సవ టెండర్లను వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో బహిరంగ టెండర్ల రూపంలో నిర్వహించడం ద్వారా వక్ఫ్ బోర్డుకు భారీ ఆదాయం లభిస్తుందని మైనార్టీ రైట్స్ ఫోరమ్ నేతలు అన్నారు. గతంలో స్థానిక మున్సిపల్ పరిధిలో నిర్వహించిన టెండర్లతో పోల్చితే, బహిరంగ టెండర్ల ద్వారా కనీసం పది రెట్లు అధిక ఆదాయం సాధ్యం అవుతుందన్నారు. ఆ ఆదాయాన్ని నిరుపేద ముస్లిం సమాజాభివృద్ధికి వినియోగించ వచ్చన్నారు. కడప పెద్ద దర్గా వక్ఫ్ ప్రాపర్టీ కింద నమోదు చేయబడిందని, వక్ఫ్ ప్రాపర్టీపై పూర్తి హక్కు వక్ఫ్ బోర్డుకే ఉంటుందని తెలిపారు. అయితే ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ అధికారులు వక్ఫ్ ప్రాపర్టీపై హక్కులు చెలాయించడం విచారకరమన్నారు. ఇకపై ప్రతీసారి వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోనే టెండర్లు నిర్వహించి, వచ్చిన ఆదాయాన్ని వక్ఫ్ బోర్డుకే చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి(డిఆర్ఓ), మున్సిపల్ కమీషనర్ కీ వినతి పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి, అధికార ప్రతినిధి డా.షేక్ ఇబ్రహీం, షేక్ మహమ్మద్ మున్నా, పఠాన్ సలీం, ఖదీర్, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తి పై దాడి గర్హనీయం..

వేంపల్లి: అక్టోబర్ 07 (ప్రభాత వార్త):

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం సాక్షాత్తు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై సనాతన ధర్మం పేరుతో రాకేష్ కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడి చేయడం అత్యంత దుర్మార్గం , దురదృష్టకరం. ప్రతి ప్రజాస్వామ్యవాది ,ప్రతి భారతీయుడు ఈ చర్యను ఖండించాలి. నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలి

వేంపల్లె :అక్టోబర్ :07 : (ప్రభాత వార్త)

ప్రజల సౌకర్యార్థం ప్రధాన రహదారులను పూర్తి చేయాలని పులివెందుల నియోజకవర్గ సీనియర్ నాయకులు డాక్టర్ దాసరి రవిశంకర్ ఆర్ అండ్ బి శాఖ అధికారులను కోరారు. మంగళవారం ఆయన చక్రాయపేట మాజీ జెడ్పిటిసి జయచంద్ర యాదవ్ తో కలిసి పులివెందుల కడప ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ రోడ్లపై మట్టి, బురద పేరుకు పోవడం వల్ల వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారి పడే ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని తెలిపారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీ వద్ద నుంచి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు రోడ్డు మరీ అధ్వాన్నంగా ఉందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి శాఖను కోరారు.

డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు..

సుండుపల్లి, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో రెండు రోజులు నిర్వహించిన ఎస్ జి ఎఫ్ ఐ మండలస్తాయి టోర్నమెంట్, సెలక్షన్స్ విజయవంతంగా ముగిశాయి. బాడ్మింటన్ అండర్ 17,14 బాలురు, బాలికల విభాగాలలో సుండుపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్ కాగా, జి కె రాచపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో రన్నర్స్ గా నిలిచారు. కబడ్డీ అండర్ 17,14 బాలుర విభాగంలో సుండుపల్లె విన్నర్స్, జి కె రాచపల్లె విద్యార్థులు రన్నర్స్ గా నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో అండర్ 17 లో జి కె రాచపల్లె విద్యార్థులు విన్నర్స్, సుండుపల్లె విద్యార్థులు రన్నర్స్ గా ఎంపికయ్యారు. కబడ్డీ అండర్ 14 లో విన్నర్స్ గా జి కె రాచపల్లె, రన్నర్స్ గా తిమ్మసముద్రం విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ అండర్ 17 లో విన్నర్స్ మడితాడు ఉర్దూ విద్యార్థులు, రన్నర్స్ తిమ్మసముద్రం తెలుగు విద్యార్థులు, అండర్ 14లో విన్నర్స్ సుండుపల్లె బాలురు, రన్నర్స్ గా తిమ్మసముద్రం తెలుగు విద్యార్థులు నిలిచారు. యోగ, చెస్ తో పాటు అథ్లెటిక్స్ లో లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాజంపేట డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు సుండుపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాఖీరా బేగం, ఎస్ జి ఎఫ్ ఐ మండల కోఆర్డినేటర్, పి డి రాధారాణి లు తెలిపారు.

మానసిక ఆరోగ్యం పై అవగాహన

దువ్వూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం మానసిక ఆరోగ్యం పై వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి మానసిక ఆరోగ్య వైద్య నిపుణులు డాక్టర్ కవితా ప్రసన్న మానసిక ఆరోగ్యం పై వివరించారు. ఈ నెల 4 నుండి 10వ తేదీ వరకు జరిగే ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న విషయాలకు ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. దురలవాట్లు ఉన్నవారు పిల్లల చదువు, క్రీడలు, యోగ తదితర వాటిపై ధ్యాస ఉంచితే మంచిదన్నారు. ప్రొద్దుటూరు నందు బుధ, శుక్రవారాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఉంటాయన్నారు. ఈ సధస్సులో డాక్టర్ సురేష్ బాబు, శాంతకుమారి, సువర్ణ, రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి 5000 రూపాయలు విరాళం..

సుండుపల్లి, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ ఎంజేఆర్ కాలనీ ఆరోగ్య పురం లో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయమునకు దేవాలయం అభివృద్ధి గాను చందాగా ముడుంపాడు గ్రామం శివరాంపురం లో నివాసమున్న గోవిందు ఆనంద్ సాయి కిషోర్ వారి కుటుంబ సభ్యులు 5000 రూపాయలు చందాగా అందజేశారని ఆలయ ధర్మకర్త అమృనాయక్ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వారికి వారి కుటుంబ సభ్యులకి అన్నివేళలా వెంకటేశ్వర్ స్వామి ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటూ ఇంకా ఎవరైనా ముందుకొచ్చి దేవాలయం అభివృద్ధి గాను సాయం చేయండి అని తెలిపారు.

పిహెచ్‌సికి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డు

నిమ్మనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

మండలంలోని నిమ్మనపల్లె ప్రభుత్వాసుపత్రి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అవార్డుకు ఎంపికైంది. సోమవారం రాయచోటిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా వైద్యాధికారి రమేష్‌బాబు ఈ అవార్డును అందుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార

ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించండి

బద్వేలు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం వల్లన వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తొట్టిగారిపల్లి వైద్యాధికారి విజయవర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని తొట్టిగారి పల్లె పిహెచ్సిలో మంగళవారం సిహెచ్ఓ చంద్రావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నర్సింహారెడ్డి మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి రోజు లార్వా, ఫీవర్ ఇంటింటి సర్వేలు నిర్వహించాలన్నారు. లార్వా వల్లనే జ్వరాలు వస్తున్నాయన్నారు. దోమ పుట్టకూడదు, దోమ కుట్టకూడదన్నారు. నీటిని కాచి చల్లార్చి వడగట్టి తాగాలి అన్నారు. డెంగ్యూ మలేరియా చికెన్ గున్యాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిలువ ఉన్నచోట ఆయిల్ బాల్స్, అబెట్, బ్లీచింగ్ చల్లాలన్నారు. ప్రతి పాఠశాలలో శుభ్రత, శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్య పరుస్తున్నామన్నారు. దోమల నివారణకు దోమతెరలె సంపూర్ణ రక్షణ అన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎటువంటి జ్వరాలు వచ్చిన వెంటనే పీహెచ్సీకి పంపాలని ప్రతినిత్యం ఆరోగ్య సేవలను అందించాలన్నారు . ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటమ్మ హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు ఏఎన్ఎంఎస్ ఆశాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలి

బద్వేలు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త

పట్టణంలో కోటవీధిలో మంగళవారం ఆశ మీటింగ్లో మలేరియా సబినిటీ ఆఫీసర్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి సౌమ్య మాట్లాడుతూ అన్ని రకాల జబ్బులకు ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు ఉన్నాయన్నారు ప్రైవేట్ ఆస్పత్రి వేల ఖర్చులు పెట్టుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు చేయించుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ లార్వా పూర్తిగా నిర్మూలించాలన్నారు ప్రతిరోజు వైద్య సిబ్బంది ఇంటింట సర్వే నిర్వహించాలి ప్రజలను చైతన్యపరచాలన్నారు. వారికి కాచి వడగట్టిన నీటిని త్రాగాలని ఇంటి పరిసరాల పడవేసిన టైర్లు కూలర్లు గుర్తించాలన్నారు దోమలు కాయిన్స్ జట్లు వాడకుండా దోమల నివారణకి వేపాకు పొగ వేయడం వల్ల దోమల కొట్టకుండా నివారించవచ్చన్నారు. దోమతెరలను వాడటం శ్రేయస్కరమన్నారు. నిండు వస్త్రాల ధరించాలి అన్నారు నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ మురికి నీటిలో ఆ బైట్ తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ చెల్లించాలన్నారు అలాగే బాల బాలికలకు వ్యక్తిగత శుభ్రతను గురించి అవగాహన కల్పించామన్నారు వారికి త్రాగే నీటిని గురించి భోజనాల గురించి పరిశీలిస్తున్నమన్నారు హెల్త్ అసిస్టెంట్ ఎస్ శ్రీరామయ్య గ్రామాల సందర్శించి జ్వరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీబి సూపర్వైజర్ భారతమ్మ లక్ష్మీదేవి ఏఎన్ఎంస్ ఆశాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడి సహించరానిది

కడప కార్పొరేషన్ అక్టోబర్ 7 ప్రభాతవార్త:

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయిపై దాడి చేయడం మన దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు అవమాన కరమైనదని దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు అన్నారు. ఈ ఘటనను ఖండిస్తున్నామన్నారు. మంగళవారం కడపలో విలేకరులతో వారు మాట్లాడుతూ దళితులు పెద్ద పదవిలో ఉన్నా దాడికి గురికాక తప్పదనేది ఈ సంఘటన ద్వారా నిరూపితం అవుతుందన్నారు. ఓర్చుకోలేక, ద్వేషపూరిత దాడులకు పాల్పడుతున్నారనీ విమర్శించారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు రక్షణ కల్పించాలన్నారు. దళిత మిత్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మురహరీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దళితులపై దాడులు చేస్తే సహించమన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

పెనగలూరు అక్టోబర్ 7 ప్రభాతవార్త

మండలంలోని ఓబిలి గ్రామానికి చెందిన కోడూరు నీరజకు మంగళవారం రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టిడిపి నాయకుడు ముక్క సాయి వికాస్ రెడ్డి కలిసి 1,25, 373 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం పాలైన పేద ప్రజల ఆరోగ్యంకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిలి మాజీ సర్పంచ్ ఎస్ హబీవుల్లా, ఓబిలి పంచాయితీ టిడిపి అధ్యక్షుడు ఎస్ అమీరుల్లా, ఉపాధ్యక్షుడు ఎస్ నాగేంద్ర దాసరి దామోదర్ నాయుడు డిష్ కరిమల జనసేన మండల కార్యదర్శి గొబ్బూరు హరి రాయల్ మోపూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నివాసుల సమస్యలపై ఇంత నిరక్ష్యమా

సిద్ధవటం అక్టోబర్ 7 ప్రభాతవార్త

మండలంలోని మాధవరం గ్రామం జగనన్న కాలనీ సమస్యలపై మంగళవారం రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ వీరభద్రుడు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం బినామీ పేర్లతో ధనవంతులకు పక్కా గృహాలు కట్టబెట్టి కాలనీలో మౌలిక వసతులు సమకూర్చక గృహనివాసులు అవస్థలు పడుతున్నారని కాలనీలో ముళ్ళ పొదలు, విపరీతంగా ఉండడంతో రాత్రి వేళలో విషపురుగులు సంచరిస్తున్న పంచాయతీ సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టగా కాలనీ గృహనివాసులు బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారని రాత్రి వేళలో విద్యుత్ దీపాలు లేక త్రీవ ఇబ్బందులకు గురై తున్నట్లు తెలిపారని కాలనీలో రోడ్డు నిర్మాణం కూడా గత ప్రభుత్వం చేపట్టలేదని కాలనీ వాసులకు సమస్యలు సంబంధిత అధికారులు పరిష్కారం చేయకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి లికిత పూర్వకంగా తీసుకెళ్తా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళి,హరి, కాలనీ గృహనివాసులు పాల్గొన్నారు.

ఎలాంటి అక్రమ నిల్వలు దొరకలేదు

గాలివీడు, అక్టోబర్ 7(ప్రభాతవార్త):

పట్టణంలోని చక్కవాండ్లపల్లె రైస్‌మిల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఎలాంటి అక్రమ నిల్వలు దొరకలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి, వీఆర్ఓ రవీంద్రారెడ్డి ధృవీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి తనిఖీల నిమిత్తం రైస్‌మిల్ వద్దకు వెళ్లగా నిర్వాహకులు ఎవరూ లేకపోవడంతో మంగళవారం ఉదయం మిల్‌లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు. అయితే ఈ దాడుల్లో ఎలాంటి అక్రమ బియ్యం నిల్వలు దొరకలేదని వారు తేల్చారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనడం, అమ్మడం నేరమని అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో భాగంగా ఆయన వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్లను బాగు చేయాలని వినతి

సుండుపల్లి, అక్టోబర్ 07, ప్రభాతవార్త :

రహదారులు మరమ్మత్తులు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు రామ శ్రీనివాస్ తెలిపారు. రాయచోటి నుండి సుండుపల్లి మీదుగా రాయవరం మరియు పించ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా కోతలకు గురై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే రాయచోటి వయా రాజంపేట రెండు వరుసల రహదారి పనులు అర్ధాంతరగా ఆగి పోయాయన్నారు. అలాగే సుండుపల్లి మండలంలోని అగ్రహారం నుండి సామిసేని గడ్డ వరకు సుమారు 9 పల్లెలకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి వాహనదారులకే కాకుండా బాటసారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రంగసముద్రం పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్

పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:

స్వచ్ఛఆంధ్ర అవార్డు 2025 జిల్లా అవార్డు కార్యక్రమంలో రంగసముద్రం పంచాయతీకి మూడు అవార్డులు వచ్చాయి. జిల్లా ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా రంగసముద్రం పంచాయతీ తరపున సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి విలేజ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి, జిల్లా ఉత్తమ హరిత రాయబారిగా మణిరత్నం, జిల్లా ఉత్తమ స్వచ్ఛ అంగన్వాడి కేంద్రం విజయ జ్యోతికి జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ , ప్రభుత్వ విప్ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ల చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డు బాధ్యతతో ఇంకా రంగసముద్రాన్ని స్వచ్ఛతగా ఉంచడానికి అహర్నిశలు ప్రయత్నం చేస్తానని ప్రజలు ఇంకా బాగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి ముత్యాల ప్రసాద్ మండల అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి, నాయకులు చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్..

పోరుమామిళ్ల రూరల్ అక్టోబర్ 7 ప్రభాత వార్త:

పోరుమామిళ్ల పట్టణంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ను మంగళవారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పట్టణంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ వివరించారు. అన్ని రకాల వస్తువులపై 5 శాతం నుండి 18 శాతం వరకు జిఎస్టి తగ్గించిన కారణంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు వివరించారు. ధరలు తగ్గడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని పోరుమామిళ్ల పట్టణ సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు.

సూపర్ జిఎస్టిపై అవగాహన

తొండూరు అక్టోబర్ 7 ప్రభాతవార్త:

స్థానిక తొండూరు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎందు విద్యార్థులకు సూపర్ జిఎస్టి 2.0 పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ లెక్చరర్ ఎస్ వెంకటసుబ్బయ్య విద్యార్థులకు సూపర్ జిఎస్టి పై వివులంగా వివరించడం జరిగింది . పేద మధ్య తరగతి వర్గాలకు వ్యవసాయ విద్యా వ్యాపార రంగానికి కేంద్ర ప్రభుత్వము సూపర్ జిఎస్టిని సూపర్ గిఫ్ట్ గా ఇచ్చిందని తెలియజేశారు ఈ జీఎస్టీ లో 28 శాతం ఉన్న జీఎస్టీ 18కు 12 ఉన్నా జీఎస్టీ 5 శాతానికి తగ్గించి ప్రజలకు అన్ని రకాలైన ఉత్పత్తులపై తగ్గించి ప్రజలకు భారాన్ని తగ్గించింది విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, లాప్టాప్స్, కంప్యూటర్స్ ఇలా విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులపై భారాన్ని తగ్గించింది ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్ రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖతర్‌లో గాలివీడు వాసి మృతి

గాలివీడు, అక్టోబర్ 7(ప్రభాతవార్త):

బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన పఠాన్ ఫయాజ్ (29) గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు గాలివీడు పట్టణం గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద నివాసం ఉంటున్న అజీజ్‌ఖాన్ కుమారుడు పఠాన్ ఫయాజ్ బతుకుదెరువు కోసం ఖతర్ వెళ్లాడు.అయితే హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఫయాజ్ మృతిచెందినట్లుగా కుటుంబసభ్యులకు సమాచారం రావడంతో ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్న వయసులోనే తమ బిడ్డ తమ నుండి దూరమవ్వడం జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

గాలివీడు, అక్టోబర్ 7(ప్రభాతవార్త):

మండలంలోని గోపనపల్లి గ్రామం నల్లాబత్తినవాండ్లపల్లె వాసి రాజుపాలెం నాగయ్య (74) తన తమ్ముడు సుబ్బరాయుడును కత్తితో హత్య చేసిన కేసులో జీవితఖైదును విధిస్తూ రాయచోటి కోర్టు తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం మేరకు వివరాలలోకి వెళ్లితే.. 2022 జూన్ 14న మల్లేశ్వరస్వామి మొక్కుబడి సందర్భంలో తోటిగాండిమడుగు వద్ద మేక నరికే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ తరువాత నాగయ్య ఊరికి వెఎళ్లి సాయంత్రం 5 గంటల సమయంలో తమ్ముడు సుబ్బరాయుడుపై వేట కొడవలితో దాడి చేయగా ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. మంగళవారం రాయచోటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జిఎస్.కృష్ణన్‌కుట్టి ఆధ్వర్యంలో విచారణ జరిపి నిందితుడు నాగయ్యకు 326 ఐపీసీ కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా 302 ఐపీసీ కింద జీవితఖైదుతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

కల్తీ మద్యం కేసును సిబిఐ కి అప్పగించాలి

మదనపల్లెక్రైమ్, అక్టోబర్ 7 ప్రభాతవార్త.

మొలకలచెరువులో వెలుగు చూసిన కోట్లాది రూపాయల కల్తీ మద్యం కేసును సిబిఐ కి అప్పగించి సమగ్ర విచారణ జరిపించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మదనపల్లె ప్రెస్ క్లబ్ లో తంబళ్లపల్లె వైసిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్ సి ఈశ్వర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్ రెడ్డి లు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్నారు. ఇందుకు నిదర్శనమే నకిలీ మద్యం వ్యాపారం అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ దాసరపల్లి జయచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఏడాదిగా పెద్ద ఎత్తున కల్తీ మద్యం తయారవుతున్నా ఎక్సైజ్ అధికారులు గుర్తించకపోవడం విచారకరమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు నిజానిజాలు వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు నాగిరెడ్డి, సాంబ, సురేంద్ర నాథ్, ప్రసాద్‌రెడ్డి, రామచంద్ర, శ్రీనివాసులు, ఖాదరవల్లి పాల్గొన్నారు.

పశువుల సంతను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లి : అక్టోబర్ 07 ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డులో ప్రతీ మంగళవారం జరిగే పశువుల సంతను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ చేర్మెన్ ఎస్.ఎం.డి. షఫీ నాయక్ తో కలిసి ఆయన మార్కెట్ చేర్మెన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా జీవాల సంత, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ధరలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని చేర్మెన్ షఫీ నాయక్‌ను కోరారు. అనంతరం నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డిని చేర్మెన్ షఫీ నాయక్ దుషాలువతో, ఘజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

పెద్దమండెం అక్టోబర్ 7 ప్రభాతవార్త

మండలంలోని గ్రామాల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ పూర్ణచంద్రిక కోరారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారు చేపడుతున్న పనులను వాటి వివరాలను తెలుసుకున్నారు. మండలంలో త్రాగునీటి బోర్లు పైప్ లైన్లు రోడ్డు మరమ్మతులు చేయాలన్నారు. అలాగే బస్టాండ్ నందు ట్రాన్స్ఫార్మరం తొలగించాలని కరెంట్ ఏఈ రామ్మూర్తి నాయక్ ను సర్పంచ్ భాష కోరారు. హౌసింగ్ పనులు వేగవంతం చేయాలని కోరారు అలాగే శివపురం సర్పంచ్ గంగులమ్మ మాట్లాడుతూ సీసీ రెండు నిర్మాణం పూర్తి చేసి చాలా కాలమైన బిల్లులు పెట్టకుంటే ఎలా అని అధికారులు ప్రశ్నించారు. వైసిపి గడువు త్వరలో ముగియ ఉండటంతో సమస్యలను పరిష్కారాజ్య దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సర్వసభ్య సమావేశం ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఎంపీడీవో శ్రీధర్ జడ్పిటిసి వీరమ్మ వైస్ ఎంపీపీ చంద్రారెడ్డి ఆర్డబ్ల్యు ఎయ్యి అశోక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంచార్జ్ సస్పెండ్ కావడంతో కోవర్ట్‌లు కనుమరుగు

పెద్దమండెం అక్టోబర్ 7 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గం ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న జైచంద్ర రెడ్డి వద్ద వైసీపీ నేతలు చలామణ అవుతున్నారు. తెలుగుదేశం కార్యకర్తలను జైచంద్ర రెడ్డి పక్కన పెట్టి వారి సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు అందులో గత వైసిపి నాయకులే 90 శాతం మంది టిడిపిలో చలామణి అవుతూ పబ్బం గడుపుతున్న విషయం తెలిసిందే. అయితే నకిలీ మద్యం కుంభకోణంలో జైచంద్ర రెడ్డి పాత్ర ఉందంటూ ప్రచారం జరగడంతో అధిష్టానం పార్టీ నుండి సస్పెండ్ చేసింది. దీనితో తెలుగుదేశం నాయకులు కూటమి నాయకులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. అయితే నకిలీ మద్యం గత వైసిపి ప్రభుత్వంలో ఉండేప్పటి నుంచి జరుగుతుందని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం మారడంతో టిడిపి నాయకులతో కుమ్మక్కై నకిలీ మద్యం కుంభకోణాన్ని సాగిస్తూ వచ్చారంటూ ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇన్చార్జిగా వ్యవహరించిన జై చంద్రబాబు రెడ్డి సస్పెండ్ కావడంతో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని మండల తెలుగుదేశం నాయకులు సంబరాలు చేసుకున్నారు.

కార్పొరేషన్‌కు స్వచ్ ఆంధ్ర అవార్డు

కడప కార్పొరేషన్ అక్టోబర్ 7 ప్రభాతవార్త:

స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని ప్రజా వైద్య అధికారి డాక్టర్ రమేష్ అన్నారు. కడప కలెక్టరేట్ లోని సభాభవన్‌లో కలెక్టర్ శ్రీధర్, జె సి అదితి సింగ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిలు కడప నగరపాలక సంస్థకు స్వచ్ ఆంధ్ర అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డు ప్రదానం జిల్లా కలెక్టర్ చేతుల మీద అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ ఆంధ్ర అవార్డు కడప జిల్లాలో నగరపాలక సంస్థ మొదటి స్థానంలో రావడానికి కమిషనర్ మనోజ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రంల మరణం అనే అవార్డు దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి అవార్డులు రావడం కొరకు నావంతు కృషి చేస్తానని తెలిపారు. కడప నగర పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి శానిటేషన్ మెరుగుపడేందుకు చర్యలుతీసుకుంటానని తెలిపారు. ఎన్విరాల్ మెంట్ ఇంజనీర్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఓ వరం

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓ వరంలాంటిదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని నలుగురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2.5లక్షలు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వారి ఇంటికి స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి చెక్కలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిఎం సహాయనిధి కింద నిదులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటి వరకు మదనపల్లె నియోజకవర్గంలో రూ.5కోట్లను సిఎం సహాయనిధి కింద చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వఏరియా ఆసుపత్రుల్లో కూడా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేకచర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డిస్వామి, నరసింహులు, రఘుపతినాయుడు, జేసిబి వేణు, మదు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై సర్పంచ్‌చే విద్యార్థులకు అవగాహన

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

బహుమతులు అందజేస్తున్న సర్పంచ్

సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు జిఎస్‌టిపై అవగాహన పొందాలన్నారు. నవతరం జిఎస్‌టి సంస్కరణలు విద్యారంగానికి భారీ పన్నులు తగ్గింపు అన్నారు. విద్యారంగం స్టేషనరీ వస్తువులపై ఉపసమనం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు జరిగిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశారదా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

నిరసన తెలుపుతున్న దృశ్యం

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన యువసేన అధ్యక్షులు పునిత్ తెలిపారు. సిజెఐపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం బివైఎస్ సభ్యులు నల్లబ్యాడ్జిలు కట్టుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పునిత్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక న్యాయవాది దాడికి పాల్పడడం న్యాయవ్యవస్థ చరిత్రలోనే అత్యంత హేయమైన చర్య అన్నారు. న్యాయస్థానం పవిత్రను గౌరవాన్ని దెబ్బతీసే విధంగా జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం, న్యాయంపై నమ్మకం ఉంచిన ప్రజలందరిపై జరిగిన ఈ దాడి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా న్యాయస్థానాల భద్రతను పటిష్టం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బివైఎస్ నాయకులు జిలానిబాషా, హరిక్రిష్ణ, వినయ్, లోకేష్, శశికుమార్, సాయికిరణ్, సంతోష్, బాలక్రిష్ణ తదితరులుపాల్గొన్నారు. అదే విధంగా బాస్ ఆధ్వర్యంలో సిజెఐపై దాడికి నిరసన కార్యక్రమాలుచేపట్టారు. వీసికేపార్టీ ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి.

పట్టణంలో వాల్మీకి జయంతి వేడుకలు

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మైదుకూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

మండలంలోని కృష్ణాపురం,అక్కులాయపల్లి, ఆదిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలోని టి.కొత్తపల్లి, ముసల్ నాయనిపల్లి గ్రామాల ఉల్లి రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ సిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రఘురామి రెడ్డి, మాజీ ప్రభుత్వ హార్టికల్చర్ శాఖ సలహాదారు సంభటూరు ప్రసాద్ రెడ్డి వారి సమక్షంలో రైతులు మాట్లాడుతూ ఎకరాకు దాదాపు లక్ష రూపాయలు పైన ఖర్చు చేయడంతో పాటు అదనంగా ఎర్రగడ్డలు వ్యవసాయ పొలం నుండి తొలగించడానికి మరికొంత ఖర్చు చేయడం జరిగిందని అయితే మార్కెట్లో రేటు లేకపోవడం ప్రభుత్వపరంగా ఎలాంటి భరోసా లేకపోవడంతో చాలా నష్టపోయామని కన్నీటితో రైతు కష్టాలను తెలుపుకున్నారు. ప్రభుత్వం ఉల్లి రైతులకు అదుకుంటామని మార్కె ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని, లేదా హెక్టారు కు 50వేల రూపాయలు చెల్లిస్తామని ప్రకటన చేసిన ఇంతవరకు వ్యవసాయ రైతుల దగ్గరకు వచ్చి పలకరించిన వారు లేరని మైదుకూరు మార్కె ఫెడ్ లోకి వెళితే ఎలాంటి సమాచారం అధికారులు తెలియజేయలేదని దీంతో చేసేది ఏమీ లేక రహదారుల వెంట కొందరు రైతులు వదిలేశారు.కొందరు పొలాల్లో అలాగే వదిలేసిన సంఘటనలు ఉన్నాయి, మరి కొంతమంది రైతులు ఎంతోకొంత సొమ్ము చేసుకోవడానికి గ్రేడింగ్ చేస్తూ వ్యాపారులు కొనుగోలు చేస్తారని ఆశతో ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులు కూలిగా మారామని మూడున్నర ఎకరా ఉల్లిపంట వేస్తే దాదాపు నాలుగు లక్షల రూపాయలు ఖర్చు వచ్చిందని అమ్ముకోవడానికి వెళ్లగా కనీసం ఖర్చులకు కూడా రాలేదని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో బాధ చెప్పుకున్నారు. మరి కొంతమంది రైతు మహిళలు మాట్లాడుతూ వ్యవసాయం చేస్తే కుటుంబం నడుస్తుందని పైర్లు పెట్టుకుంటే ఉల్లి మంట ధరలు లేక పేదవాడికి కంట కన్నీరు తోపాటు కుటుంబం గుర్తుకొచ్చి ఎలా బతకాలో మా బాధ అర్థం కావడం లేదని మొర పెట్టుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఎంతో కొంత సహాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే వైయస్సార్ సిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈరోజు రైతుల జీవన ఉపాధి ఎలా ప్రభుత్వ నిరక్ష్యం, వైఫల్యం, కనీస మద్దతు ధర ప్రకటించకపోవడం రైతు లేకపోతే దేశానికి అన్నం ఎవరు పెడతారు. కనీస మద్దతు ధర ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి చేతకాదా.. కనీస మధుర 1200 రూపాయలు కలెక్టర్ జెసి ప్రకటన చేసి మైదుకూరు యార్డ్ ఓపెన్ చేసాము కొనుగోలని చేసిన రైతులు అక్కడికి వెళితే విచారిస్తే ఎలాంటి సమాచారం లేదన్నారు. రైతులను ఆదుకోకపోతే రైతులతో ఉల్లి పంటను తీసుకొని కలెక్టరేట్ కార్యాలయాలకు వెళ్లి రైతుకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఈ పోరాటంలో రైతులు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలోలో చేర్చాలన్న డిమాండ్ వాల్మీకి బోయ జాతి ఐక్యతతోనే సాధ్యం

రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు అక్టోబర్ 7 ప్రభాతవార్త



వాల్మీకి బోయలను ఎస్టి జాబితాలో చేర్చాలని డిమాండ్ మనందరి ఐక్యతతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు పునరుద్ఘాటించారు. మంగళవారం ఎంతో పవిత్రమైన రామాయణం రచించి సమాజానికి విలువలను నేర్పిన వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తో పాటు కొత్తపల్లి బైపాస్ కూడలిలో ఏర్పాటుచేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొత్తపల్లి బైపాస్ కూడలి నుండి కొత్త బస్టాండు శివాలయం వీధి రాజీవ్ సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన వాల్మీకి కుల బాంధవుల సభలో ఆయన మాట్లాడుతూ కుల వృత్తి లేని మన వాల్మీకులు ఎంతో వెనుకబడి ఉన్నారని జాతి అభివృద్ధికి మనమంతా ఏకమై కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మనలో మనకు ఎన్ని మనస్పర్థలు ఉన్నా జాతి అభివృద్ధి కోసం ఐక్యత కావాలన్నారు. ఐక్యతగా ఉండి ఉద్యమిస్తేనే ఎస్టీ జాబితాలో వాల్మీకులను చేర్చే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 13 జిల్లాలకు గాను ఐదు జిల్లాలలో ఎస్టీ జాబితాలో ఉండి ఎనిమిది జిల్లాలలో లేకపోవడం మన దురదృష్టకరమన్నారు. గతంలో మాదిరిగానే వాల్మీకి బోయలను ఎస్టి జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల వాల్మీకి బోయలకు కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. విద్యాభ్యాసం లోను ఉద్యోగంలోనూ రిజర్వేషన్లు అమలు అవుతాయని దాని వల్ల వాల్మీకి బోయల కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. అంతే కాకుండా ఎస్టీ రిజర్వేషన్ వల్ల ప్రభుత్వము నుండి రావలసిన అన్ని ప్రయోజనాలు లభ్ధి పొందుతామని ఆయన వివరించారు అందుకే మనమంతా ఏకమై మన జాతిని ఎస్టీ జాబితాలో ఎంతవరకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే కాలంలో పార్టీలకతీతంగా వాల్మీకి బోయల మంతా ఏకమై ఉద్యమ కార్యచరణ రూపొందించుకుంటామని తెలిపారు అంతేకాకుండా వాల్మీకి బోయ సంక్షేమ సంఘంలో యువత ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కావున యువజన విభాగాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా మనమంతా ఏకమై ఎస్టీ జాబితాలో చర్చలకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు వాల్మీకి సంఘం అధ్యక్షులు రిటైర్డ్ ఎస్ఐ పోలేపల్లి ఆంజనేయులు టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ మండ్ల మల్లికార్జున రఘునాథ్ మహిళా నేతలు సౌభాగ్యమ్మ నల్ల బోతుల పావని ఖాదరాబాద్ గ్రామ వాల్మీకులు తదితరులు పాల్గొన్నారు.

యంపి అవినాష్, జిల్లా అధ్యక్షులు రవిరెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, కేశవరెడ్డి

బద్వేల్ అర్బన్ అక్టోబర్ 07 ప్రభాతవార్త :

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్సీపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా కేశవరెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వలన ఇందుకు సహకరించిన యం,పి వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ డి,సి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ లను మంగళవారం కడప, పులివెందులలోని మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ స్వచ్ఛంద కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గాజులపల్లి కేశవరెడ్డి ఇరువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలలతో సత్కరించి స్వీట్ బాక్స్ అందజేసి పలువురికి వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు గానుగపెంట రమేష్ బాబు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగం సుబ్బారెడ్డి, ఏరియా కన్వీనర్ పంగా చెన్న కృష్ణారెడ్డి, పుత్త శ్రీరాములు ఎంఆర్ఎఫ్ టైర్స్ డీలర్ గుర్రంపాటి రమణ రెడ్డి,జీ, కృష్ణారెడ్డి, రూపరము పేట శివాలయం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ మడకల రఘురామి రెడ్డి, వేముల సుబ్బరాజా గుత్తల రమణయ్య, గుర్రంపాటి పోలిరెడ్డి, గణమంతు వెంకటసుబ్బయ్య పలువురు పాల్గొన్నారు.

నాగభూషణం కళాశాలలో ఆర్మీ ఎన్రోల్మెంట్ సెలక్షన్స్

బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 , ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ ,పీజీ (అటానమస్) కళాశాలలో మంగళవారం ఎన్.సి.సి.లో ఆర్మీ ఎన్రోల్మెంట్ సెలెక్షన్స్ నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా కళాశాలలో విద్యార్థులకు ఎన్.సి.సి.లో శిక్షణను ఇప్పిస్తున్నారని, ఇందులో భాగంగా ఆర్మీ ఎన్రోల్మెంట్ సెలెక్షన్స్ జరిగాయని కళాశాల పరిపాలన అధికారి వెంకట సాయి కృష్ణ తెలిపారు. కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు ఆర్మీ ఎన్రోల్మెంట్కి సెలెక్ట్ అయ్యారని ఆయన తెలియజేశారు. ఈ ఎంపిక ప్రక్రియ లో కల్నల్ యన్. సూర్యనారాయణ మూర్తి, లెఫ్టినెంట్ కల్నల్ హెచ్. లలిత్బాబు, సుబేధార్ ఏ.వి. అనిల్ కుమార్, సుబేధార్ రూపేంద్రజిత్ సింగ్, కళాశాల ఎన్సి.సి. లెఫ్టినెంట్ బాల ఓబులేసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి సెలక్షన్స్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

సమిష్టి కృషి ఫలితమే ఈ పురస్కారం

పీలేరు అక్టోబర్ 7 ప్రభాతవార్త ;

ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఫలితమే స్వచ్ఛ స్కూల్ పురస్కారమని ప్రధానోపాధ్యాయిని డి. ప్రేమరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు 2025లో భాగంగా పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్వచ్ఛ స్కూల్ పురస్కారం దక్కింది. సోమవారం రాత్రి అన్నమయ్య జిల్లా కేంద్రంలో స్వచ్ఛ స్కూల్ పురస్కారాన్ని హెచ్ఎం ప్రేమరాణి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధి, సుందరీ కరణ, స్వచ్ఛత కోసం గతంలో ఇక్కడ పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. వారి శ్రమ ఫలితంగా స్వచ్ఛ స్కూల్ పురస్కారం పొందగలిగామని అన్నారు. పాఠశాల అభివృద్ధికి పనిచేసిన ఇంకొందరు టీచర్లు ఇక్కడే పనిచేస్తుండడం, వారితో తాను కూడా కలిసి విధులు నిర్వహిస్తుండడం తనకెంతో గర్వంగా ఉందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఇకముందు కూడా అందరం ముందుకు పోదామని తెలియజేశారు.

స్వచ్ఛ స్కూల్ పురస్కారం అందుకుంటున్న హెచ్ఎం ప్రేమరాణి

గోవిందరెడ్డికి ఘన సత్కారం

బద్వేలు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ గోవిందరెడ్డి నీ , పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు . ఆయన భవిష్యత్తులో ఇలాంటి పదవులు మరెన్నో పొందాలని వారు ఆకాంక్షించారు. ఆయనను సత్కరించిన వారిలో బద్వేల్ మున్సిపాలిటీ నాయకులు రాష్ట్ర వైఎస్ఆర్ టి యుసి సెక్రటేటరీ సింగసాని శివయ్య, వైస్సార్సీపీ యువ నాయకులు, సింగసాని రాజేష్, శ్రీ కృష్ణ,నూనె చంద్ర, అమరస్వామి చెన్నయ్య, దూల్ల సుబ్బయ్య, ఆవుల లక్ష్మి నారాయణ,చెన్నయ్య,చీట్టి, నాగేశ్వరావు, వెంకటేష్, నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకురప్పల్లె గ్రామంలో మారేమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రామసముద్రం,అక్టోబర్7,ప్రభాతవార్త

మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామంలో ఆలయంలో మంగళవారం మారేమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అనిల్ స్వామి అర్చకబృందం వేద మంత్రాల నడుమ, హోమం నిర్వహించి,నూతన మారేమ్మ విగ్రహ ప్రతిష్ఠకార్యక్రమం గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

పీలేరు అక్టోబర్ 7 ప్రభాతవార్త :

నియోజకవర్గం వాల్మీకిపురంలోని శ్రీ పట్టాభిరామ స్వామి వారి ఆలయంలో మంగళవారం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం భాగవత ఆరాధన, మహా పూర్ణాహుతి, కుంభ ప్రక్షన, పవిత్ర విసర్జన, చక్రస్నానం తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం తిరుచ్చి వీధి ఉత్సవంలో భాగంగా ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా వెళ్లి భక్తులకు ఆశీర్వదించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య విద్యార్థులకు ఉద్యోగాలు

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మదనపల్లె, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 10మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. కళాశాలలో స్టాండ్ఫర్ యూ సొల్యూషన్స్ సంస్థచే ఈ ప్రాంగణ ఎంపికలు జరిగాయన్నారు. ఆ సంస్థ హెచ్ఆర్ మేనేజర్ తేజేష్గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 10మంది ఇంజనీరింగ్ విద్యార్థులు రూ.3.5లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్తో పాటు పలువురు అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆయన తెలిపారు. తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాముడు, ప్లేస్మెంటు అధికారి మనోజ్కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయ స్వామికి విశేష పూజలు

బద్వేల్ అర్బన్ అక్టోబర్ 07 ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్ సుమిత్రానగర్లో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ పూజారి వీరేశచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది.ప్రత్యేక అభిష్నేక ఉభయదాతలుగా తుమ్మల పెంట సురేష్ బాబు సతీమణి జయ ప్రదాదేవి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయం మేనేజర్ మాడపూరు వెంకటరమణ మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా మహోత్సవం

ఘనంగా దసరా మహోత్సవం దృశ్యం

పీలేరు అక్టోబర్ 7 ప్రభాతవార్త:

వాల్మీకిపురం మేజర్ పంచాయతీ నందు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య వాహనాలకు పూజ చేసి బాణసంచా కాల్చి తదుపరి వాహనాలను వాల్మీకులు వీదుల్లో తిప్పి విందు కార్యక్రమం చేసుకున్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమా గంగులమ్మ ఎంపీడీవో మనోహర్ రాజ్, ఈ ఓ ఆర్ డి సుధాకర్ రెడ్డి, పంచాయతీ ఈవో రవీంద్రనాథ్ పంచాయతీ సిబ్బంది సురేష్ ,నరేష్, శ్రీరాములు, వెంకటేష్ ,శివ, వసంతమ్మ, రాజు, కుమార్, కీర్తన,గాయత్రి, ఓం ప్రకాష్ ,హరిప్రసాద్ ,రమణ, చంద్ర ,జయరాం, హరి, రెడ్డి రామానుజులు, రేవంత్, మరియు నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా..

కడప క్రైం, అక్టోబరు 7, ప్రభాతవార్త:

కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప జిల్లా రూరల్ పరిధిలో గల వికలాంగుల కాలనీలో గల యూపీహెచ్సీ నందు ఆశా వర్కర్లు మరియు ఏఎన్ఎంలకు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఎవరైనా గంజాయి ఇతర మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా రవాణా చేసిన చట్ట రిత్యా నేరమని తెలిపి గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు ఈగల్ టోల్ ఫ్రీ నెబంబర్ 1972కు సమాచారం తెలపాలని కోరారు. అదే విధంగా ఈగల్ సోషల్ మాధ్యమాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ గురించి తెలిపి సబ్స్క్రైబ్ చేయిండం జరిగింది. ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ అనూష, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నార్కోటిక్ సెల్ నుంచి ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ సిబ్బంది, ఆయా ఈగల్ సిబ్బంది ఆయూబ్ఖాన్, గురుశేఖర్ తదితులు పాల్గొన్నారు.

నేటి నుండి మండల స్థాయి క్రీడా పోటీలు

గాలివీడు, అక్టోబర్ 7(ప్రభాతవార్త):

2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 8, 9, 10వ తేదీలలో గాలివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ గంగరాజు, ప్రధానోపాధ్యాయులు జాపర్ తెలిపారు. ఈ పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ వంటి విభాగాలలో అండర్-14 మరియు అండర్-17 వయో విభాగాల విద్యార్థులు పాల్గొననున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య పరిరక్షణ, జట్టు సహకార భావనను పెంపొందించడమే ఈ పోటీల యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

వైఎస్ఆర్సిపి సీఈసీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్గా ఎన్నికైన ఎమ్మెల్సీ బీసీ గోవిందరెడ్డిని గౌరవ పూర్వ గంగా కలవడం జరిగింది, డాక్టర్ దాసరి శ్రీనివాసులు జిల్లా కార్యదర్శి డాక్టర్ల విభాగం ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొనడం జరిగింది.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్కు భాష్యం విద్యార్థులు ఎంపిక

మదనపల్లె క్రైమ్, అక్టోబర్ 7 ప్రభాతవార్త.

మదనపల్లె భాష్యం పాఠశాల విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో నలుగురు విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, జిల్లా స్థాయి టోర్నమెంట్కు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగం లో జి. సాయిమానిష్ మొదటి స్థానంలో నిలవగా, ఎస్. నజీఫ్ ద్వితీయ స్థానాన్ని సాధించాడు. అలాగే అండర్ 17 విభాగంలో జి. కుశల్ రెడ్డి ప్రథమ స్థానం దక్కించుకో, వి. చైత్రదర్శిని ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్కు ఎంపికయ్యారు. మీరు నలుగురు జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రతిభ చాటి సత్తా చాటాలని జోనల్ ఇంచార్జ్ లక్ష్మణ్, ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ సూచించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను, పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ యాస్మిన్లను అభినందించారు.

క్రీడాపోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

సిద్ధవటం అక్టోబర్ 7 ప్రభాతవార్త

మండలంలోని భాకరాపేట సమీపంలోని 11 వ బెటాలియన్లో జరిగిన ఎస్జిఎఫ్ మండలమీట్ క్రీడా ఎంపికలలో సిద్ధవటం బ్రాహ్మణ వీధిలోని శ్రీ సాయి హై స్కూల్ విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ మరియు ఖోఖో ఆటలతో ఉత్తమ ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 కబడ్డీ పోటీలలో పదవ తరగతి చదువుచున్న రాంచరణ్,సాయి యశ్వంత్ ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో కబడ్డీ నందు తొమ్మిదవ తరగతి చదువుచున్న మనోజ్, యశ్వంత్ రెడ్డి, ఎనిమిదవ తరగతి చదువుతున్న షేక్ సమీర్ ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో వాలీబాల్ నందు 10 వ తరగతి కి చెందిన గణేష్, మోలాలి, సాయి యశ్వంత్, రాంచరణ్ ఎంపికయ్యారు, ఖోఖో బాలుర విభాగంలో కేశవకుమార్, అయూబ్, చెన్న కేశవ రెడ్డి, మోహన్, ప్రణయ్ కేశవ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, బాలికల విభాగంలో పల్లవి, సహస్ర,సాయి కీర్తన, హిమ వందన, సువర్ణ,స్వప్న,వైష్ణవి,శాన్వి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో సత్తా చాటి విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ రేవతి దేవి, పాఠశాల ఇంచార్జ్ రాజేష్ అభినందించారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

లక్కిరెడ్డిపల్లి : అక్టోబర్ 07 ప్రభాత వార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వాల్మీకి జయంతి వేడుకలకు నియోజకవర్గం టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారని లోకానికి చాటిన మహా పురుషుడు వాల్మీకి అని, ఆదర్శ జీవితాన్ని గడపడానికి మానవుల ఆచరించాల్సిన ధర్మాలన్నింటినీ శ్రీ రామాయణ కావ్యంలో పొందుపరిచిన ఆదికవి వాల్మీకి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్ రెడ్డి, మండల టిడిపి ఇన్చార్జ్ యనమల మదన్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీనాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, వైస్చేర్మెన్ మల్లికార్జున, నాయకులు ఆరిఫ్, విజయభాస్కర్, లక్ష్మీ నారాయణ, కృష్ణ, రామాంజనేయులు, విశ్వనాథ్, మసూద్, ఓబులేసు, ముక్తార్ అహ్మద్, మూగి వెంకటరమణ, పక్కీరయ్య, శ్రీను, అన్వర్, వీరభద్ర, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కడప జిల్లా
బద్వేలు రూరల్, పోరుమామిళ్ల, కొండాపురం, లింగాల, సికెదిన్నె, అట్లూరు

అన్నమయ్య జిల్లా
బి.కొత్తకోట, వీరబల్లి, పిటిఎం, కలకడ, వాయల్పాడు, రైల్వేకోడూరు, పుల్లంపేట, నందలూరు

ఇంటర్వ్యూ తేది : 11.10.2025
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు